ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
5★★★
మంగళవారం 4 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:26 మంగళవారం
సహర్ 5:12 బుధవారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య



ఉపాధ్యాయుల ఓట్లు లెక్కిస్తున్న కౌంటింగ్ సిబ్బంది

విజయ సంకేతం చూపిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

- మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఘన విజయం
- రెండో స్థానంలో నిలిచిన పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

కరీంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలం విరబూసింది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఘన విజయం సాధించారు. ఆయన తన సమీప పీఆర్టీయూ బలపరిచిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిపై 5,777 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. బీజేపీ మాత్రమే ఈ స్థానంలో అభ్యర్థిని పోటీలో నిలుపగా మిగతా పార్టీలు దూరంగా ఉన్నాయి. 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా ప్రధానంగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు పీఆర్టీయూ బలపరిచిన వంగ మహేందర్‌రెడ్డి గట్టి పోటీనిచ్చారు. నియోజకవర్గంలో 27,088 మంది ఓటర్లు ఉండగా 25,041 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని...

మిగతా 7లో..

ఈ విజయం ఉపాధ్యాయులకు, మోదీకి అంకితం

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

7



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సమక్షంలో స్ట్రాంగ్‌రూం తలుపులు తెరుస్తున్న సిబ్బంది

పట్టభద్రుల స్థానంలో కొనసాగుతున్న ఉత్కంఠ

- పూర్తికాని చెల్లని ఓట్ల విభజన
- నేటి మధ్యాహ్నం వరకు ట్రెండ్స్ వెల్లడయ్యే అవకాశం



పట్టభద్రుల ఓట్ల గురించి ఏజెంట్లకు తెలుపుతున్న కౌంటింగ్ సిబ్బంది

కరీంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఉత్కంఠ కొనసాగుతోంది. కరీంనగర్ జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్ల

మిగతా 7లో..



బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

దివ్యాంగులకు యూడీఐడీ జారీ చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి దివ్యాంగుడికి యూడీ ఐడీ జారీకి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. యూనిక్ డిసేబులిటీ ఐడి జారీ (యూడీఐడీ)పై సోమవారం సమీక్ష నిర్వహించారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ బదులు యూనిక్ డిసేబులిటీ ఐడి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇవ్వాలని స్పష్టం చేశారు. దివ్యాంగులకు వైద్యులచే ధ్రువీకరించిన వైకల్య సదరన్ సర్టిఫికెట్, వారి పూర్తి వివరాలు జనరేట్ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. దృష్టిలోపం, కుష్టి వ్యాధిగ్రస్తులు, వినికిడి, అంగవైకల్యం, మానసిక వైకల్యం గల వారికి వైకల్య శాతాన్ని పరిశీలించి (యూడీఐడీ) కార్డులు జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నూతనంగా కార్డుల కోసం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, సదరం సర్టిఫికెట్ ఉన్నవారికి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ద్వారా యూడీఐడీ జనరేట్ చేస్తారని వివరించారు. జిల్లాలో ఉన్న మీసేవ కేంద్రాల నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు, సీసీలు, ఎంపీడీవోలు,ఏడీఎంలకు యూడీఐడీ దరఖాస్తుల నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రిలో యూడిఐడీ నిర్ధారణ ప్రక్రియ కోసం అవసరమైన వైద్యులు, పరికరాలు ఉండేలా చూడాలని, క్యాంపు అప్పుడు దివ్యాంగులకు కుర్చీలు, తాగునీరు ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఓ శేషాద్రి, డిడబ్ల్యూఓ లక్ష్మీరాజం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సిరిసిల్ల సూపరిండెంట్ లక్ష్మీనారాయణ,వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ పెంచలయ్య ఉన్నారు.

పరీక్షల సమయంలో సమయ పాలనతో బస్సులు నడపాలి

- డిపో మేనేజర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

సిరిసిల్ల టౌన్, మార్చు 3(ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో సమయ పాలనతో బస్సులను నడపాలని కోరుతూ సోమవారం సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. మార్చిలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నాయన్నారు. అదనంగా ఆర్టీసీ బస్సులు వేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్కాన్, అనిల్, వినయ్, లక్ష్మన్, తిరుపతి, శ్రీకాంత్, అక్షయ్, రాజు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మారుతున్న టెక్నాలజీకి అనుగునంగా పోలీసులు వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుని విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రెండవ దశ శిక్షణలో భాగంగా నూతన కానిస్టేబుళ్లకు 15రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కేసుల విచారణ నివేదికలను పటిష్టంగా రూపొందించడంలో రైటర్ల పాత్ర కీలకమన్నారు. నిందితులకు శిక్షలు పడే విధంగా చేయవచ్చన్నారు. నూతన కానిస్టేబుళ్లు వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. కొత్త చట్టాలు, సాక్ష్యాధారాలు ఏ విధంగా సేకరించాలనేది ప్రధానమన్నారు. శవ పంచనామా ఎలా చేయాలో తెలుసుకోవాలని, నేరస్థలంలో ఏఏ వస్తువులు స్వాధీనం చేసుకోవాలో తదితర విషయాలను గమనించాలన్నారు. సాక్షుల వాంగ్మూలం ఏవిధంగా నమోదుచేయాలని తెలుసుకోవాలన్నారు. ఇందులో భాగంగానే ప్రతి కేసులలో ఫిర్యాదు స్వీకరణ, కేసు నమోదు, ఇన్వెస్టిగేషన్, చార్జీషీట్ వరకు ఏ విధంగా చేయాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇన్స్‌పెక్టర్ మధుకర్ అన్ని పోలీస్‌స్టేషన్‌ల రైటర్‌లు పాల్గొన్నారు.



కానిస్టేబుల్స్‌కు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- గ్రీవెన్స్‌డేలో 16 ఫిర్యాదులు

శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 16 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం బాధితులకు న్యాయం అందించే విధంగా చూస్తామన్నారు. సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తామన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై అవగాహన కల్పించాలి

వేములవాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం కింద దరఖాస్తు చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వెసులుబాటుపై అవగాహన కల్పించాలని వేములవాడ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అభినవ్ అన్నారు. సోమవారం ఆయన మున్సిపల్ ఉద్యోగులతో మాట్లాడుతూ వేములవాడ పురపాలక సంఘం పరిధిలో 16 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖ సంయుక్తంగా పరిశీలించిన దరఖాస్తులు 11 వేల దరఖాస్తులు ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు.

ప్రతి ఉద్యోగికి 600 దరఖాస్తులను కేటాయిస్తామని ప్రతిరోజు ఇకపై మార్చి 31లోపు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీపై అవగాహన కల్పించాలని సూచించారు.

సాగునీటి కాలువలు పూర్తి చేయాలని దీక్ష



రిలే నిరాహార దీక్షలో రైతులు

ఇల్లంతకుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పంటలు ఎండిపోతున్న పట్టించుకోవడం లేదని పేర్కొంటు రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మండలంలోని పెద్దలింగాపూర్, రామోజిపేట, చిక్కుడేవానిపల్లె, తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్, బాలమల్లుపల్లె, ఎడ్లోనికుంటలకు చెందిన రైతులు సోమవారం పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా రంగనాయకసాగర్ నుండి ఎల్‌ఎం 6 కాలువ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. భూసేకరణలో జాప్యం వల్ల పనులు నిలచిపోయాయని దీనితో దాదాపు 7 గ్రామాల రైతుల పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. కాలువ పనులు పూర్తిచేసి సాగునీటిని అందించాలని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకవచ్చినా స్పందించలేదన్నారు. ప్రభుత్వం స్పందించి పనులు పూర్తిచేయాలని, తమకు స్పష్టమైన హామీ లభించే వరకు నిరసన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, అశోక్, కొమురయ్య, నవీన్, అంజనేయులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్ ఇవ్వని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



డీఐఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 3 (అంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ పరీక్షలు రాసే విద్యార్థులకు హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకుని విద్యార్థులకు హాల్ టికెట్‌లను ఇప్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ఇంటర్మీడియేట్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు ఫీజులు కట్టలేదని కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్‌లు ఇవ్వడం లేదని మరోవైపు స్కాలర్‌షిప్‌లు పూర్తి స్థాయిలో రాలేదని డబ్బులు చెల్లించాలని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి స్పందించి కళాశాలల్లో పర్యటించి విద్యార్థులందరికీ హాల్ టికెట్‌లను అందించడంతో పాటు ఇంటర్మీడియేట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు.

పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాబిన్సన్, తనుగుల రాకేష్, అదిత్య, చరణ్, అక్షయ్, అజయ్, నరసింహ, ప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), మార్చి 3 (అంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌ను సోమవారం వేములవాడ ఏఎస్పీ శేషాద్రిరెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించడంతో పాటు స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలు, గంజాయి స్మగ్లింగ్, బియ్యం, ఇసుక అక్రమ రవాణాలతో ఇతర కేసుల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల కనీస వేతన జీవోలను సవరించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 3 (అంధ్రజ్యోతి): కార్మికుల కనీస వేతన జీవోలను ప్రభుత్వం సమరించాలని, ఈ నెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో సోమవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలిసి రమణ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్ పరిశ్రమలకు సంబంధించి కనీస వేతనాల జీవోలను పెట్టుబడిదారులు, యజమానులకు అనుకూలంగా సవరించిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ 26 వేలు నిర్ణయించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో 6వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా, 7వ తేదీన హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్, సూరం పద్మ, నక్క దేవదాస్, బెజుగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటేనా..?



- పంచాయతీల ఏకగ్రీవంపై గ్రామాల్లో చర్చలు
- గత ప్రభుత్వంలో నిలుపుకోని హామీ
- జిల్లాలో 41 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం
- రూ.4.10 కోట్ల ప్రోత్సాహానికి మంగళం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వం అందించే ప్రోత్సాహం గ్రామాభివృద్ధికి ఉపయోగపడుతుందని ఊరంతా ఒక్కటై ఐక్యతను చాటుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామ పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవం చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు లభించకపోవడంతో నిరాశే మిగిలింది. గత ప్రభుత్వ హయాంలో ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షలు ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రోత్సహానికి సంబంధించిన కనీసం జీవో కూడా జారీ కాలేదు. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లా 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవం చేసుకున్నా గ్రామాల్లో ఇప్పుడు మళ్లీ ఏకగ్రీవం చేసుకుందామా వద్దా అనే చర్చ మొదలైంది. జిల్లాలో 253 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగగా 41 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. వాటికి సంబంధించిన ప్రభుత్వం అందించే రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహం పాలకవర్గాల గడువు ముగిసిపోయే నాటికి కూడా ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ క్రమంలోనే ఎకగ్రీవాలపై పల్లెల్లో అసక్తి చూపడం లేదు. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు పల్లెల్లో పట్టు సాధించాలనే అడుగులు వేస్తున్నాయి. అధికారంలో ఉండడంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ పంచాయతీలు కైవసం చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని భావిస్తున్నా బీఆర్ఎస్ మళ్లీ పూర్వవైభవం కోసం తహతహలాడుతోంది. కాంగ్రెస్ ఏకగ్రీవాల వైపు దృష్టి సారించే అవకాశాలు ఉన్నా బీఆర్ఎస్ పోటీ జరిగే విధంగానే చూసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో కూడా ఏకగ్రీవాలపై అసక్తి కనబర్చడం లేదు.

- ఎదురు చూపులతోనే ముగిసిన గడువు

పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికైన మొదలు ప్రోత్సాహక నిధులపై పాలకవర్గాలకు ఎదురుచూపే మిగిలింది. గత ప్రభుత్వం ప్రకటించినట్లుగా హామీ నిలుపుకుంటే జిల్లాలో ఎకగ్రీవమైన గ్రామ పంచాయతీలు 41 ఉండగా వీటికి ప్రోత్సాహం కింద రూ 4.10 కోట్లు వచ్చేవి. గతంలో రూ.7 లక్షలు ఉంటే దీనికి గత ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 18 ఎకగ్రీవ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దీనికి అదనంగా ఎమ్మెల్యే నిధులు కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే చెప్పినట్లుగానే నిధులు కొంతమేరకు వివిధ పథకాల ద్వారా సమకూర్చారు. కానీ ప్రభుత్వం అందించే రూ.10 లక్షల ప్రోత్సాహం కోసం ఎదురుచూస్తూ పాలకవర్గం గడువు కూడా ముగిసిపోయింది.

పలు గ్రామాల్లో అప్పటి సర్పంచ్‌లు అప్పులు చేసి పనులు చేపట్టగా బిల్లుల కోసం నిరసనలు,ఆందోళనలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి.

- ఏకగ్రీవ పంచాయతీలు

సిరిసిల్ల జిల్లాలో గత ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీలు బోయినపల్లి మండలంలో కోరెం, చందుర్తి మండలంలో దేవునితండా, కట్టలింగంపేట, కొత్తపేట, ఇల్లంతకుంట మండలంలో చిక్కుడువానిపల్లె, గుండెపల్లి, కిష్టారావుపల్లి, పెద్దలింగాపూర్, రామోజీపేట, సోమారంపేట, గంభీరావుపేట మండలంలో లక్ష్మీపూర్, రాజుపేట, పొన్నాలపల్లి, కోనరావుపేట మండలంలో అజ్మీర తండా, గోవిందరావుపేట తండా, జై సేవాలాల్ భూక్య తండా, జై సేవాలాల్ ఊరు తండా, కమ్మరిపేట తండా, గొల్లపల్లి తండా, ముస్తాబాద్ మండలంలో గన్నవానిపల్లె, రుద్రంగి మండలంలో అడ్డబోరు తండా, బడి తండా, చింతమాని తండా, డేగావత్ తండా, రూపులానాయక్ తండా, సర్పంచ్ తండా, వీరుని తండా, తంగళ్లపల్లి మండలంలో చింతల్‌ఠాణా, నర్సింహులపల్లె, వీర్నపల్లి మండలంలో మద్దిమల్ల తండా, బాబాయి చెరువు తండా, భూక్య తండా, లాల్ సింగ్ తండా, శాంతి నగర్, ఎర్రగడ్డతండా, వేములవాడ రూరల్ మండలంలో తుర్కాశినగర్, ఎల్లారెడ్డిపేట మండలంలో బుగ్గ రాజేశ్వర్‌తండా, గుంటపల్లి చెరువు తండా, దేవుని గుట్ట తండా, అగ్రహారం, హరిదాస్‌నగర్, గ్రామ పంచాయతీలు పూర్తి పాలకవర్గంతో సహా ఏకగ్రీవం అయ్యాయి.



ఆదా చేస్తేనే 'గృహ జ్యోతి'

- వేసవి దృష్ట్యా పెరిగిన విద్యుత్ వినియోగం
- 200 యూనిట్లు దాటితే వర్తించని పథకం
- పొదుపుగా వాడుకుంటే గట్టెక్కే అవకాశం

గణేశ్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. వేడికి తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం ఏసీలు, కూలర్ల వద్ద ఉపశమనం పొందుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం ఎక్కువవుతోంది. విద్యుత్ వినియోగం పెరిగితే గృహజ్యోతి లబ్ధిదారులకు పథకం వర్తించకుండా పోతుంది. పథకం కింద ప్రభుత్వం లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు జీరో బిల్లు జారీ చేస్తోంది. ఇందులో 200 యూనిట్ల కంటే ఒక్క యూనిట్ అదనంగా వచ్చినా బిల్లు కట్టాల్సిందే. ఈ సమస్య నుంచి గట్టెక్కాలంటే విద్యుత్‌ను పొదుపు చేసుకోవాలి. ఇందు కోసం ఉపకరణాలను పూర్తిగా కట్టేయాల్సిన అవసరం లేదు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే నిరంతరాయంగా గృహజ్యోతిని వెలిగించొచ్చు. జిల్లాలో మొత్తం విద్యుత్ కనెక్షన్లు 5,59,000 ఉండగా అందులో వ్యవసాయ కనెక్షన్లు 1,09,000 ఉన్నాయి. గృహాలకు సంబంధించినవి 4,50,000 ఉండగా అందులో 1,64,000 మంది గృహజ్యోతి లబ్ధిదారులు ఉన్నారు. వీరు ప్రతీ నెల రూ.5.9 కోట్ల సబ్సిడీ పొందుతున్నారు.

ఇలా చేద్దాం

- దాదాపు అన్ని ఇళ్లలో ఎల్‌ఈడీ బల్బులు వినియోగిస్తున్నారు. కొందరు ఇప్పటికీ ఫ్లోరోసెంట్ ట్యూబ్‌లైట్లు వాడుతున్నారు. వాటి సామర్థ్యం 40. వాట్స్ ఉండడంతో బిల్లు పెరిగే అవకాశముంది. దీని దృష్ట్యా ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లయితే మేలు.
- ఏసీలు 24 నుంచి 29 డిగ్రీల మధ్య ఉపయోగిస్తే చల్లదనంతో పాటు బిల్లు ఆదా అవుతుంది. ప్రస్తుతం మార్కెట్లో ఇన్వర్టర్‌తో కూడిన ఏసీలు అందుబాటులో ఉన్నాయి. గది చల్లబడగానే ఆటోమెటిక్‌గా ఏసీ రన్నింగ్ నిలిచిపోతుంది. వీటితో కొంత విద్యుత్ వినియోగం తగ్గే అవకాశముంది. సాధారణ ఏసీలు కరెంటు పోయి వచ్చినప్పుడు పునః ప్రారంభమయ్యే సమయంలో లోడ్ పెరుగుతుంది.
- సీజన్ మేరకు రిఫ్రిజిరేటర్ దశలు మారుస్తూ ఉండాలి. వేసవిలో ఎక్కువ స్పీడ్ ఉంచినా మిగిలిన కాలాల్లో తగ్గించుకోవాలి. మంచు పొరలు పావంతు పెరిగినట్లు గమనిస్తే వెంటనే డీఫ్రాస్ట్ ఆప్షన్‌ను తొలగించాలి.
- ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, ఎల్‌ఈడీ బల్బులు, రిఫ్రిజిరేటర్లు తదితర విద్యుత్ గృహోపకరణాలకు 5 స్టార్స్ ఉంటే విద్యుత్ వినియోగం తగ్గి బిల్లు ఆదా అవుతుంది.
- కంప్యూటర్లు, టీవీలు, ఫ్యాన్లు అవసరం లేని సమయంలో స్విచ్ ఆఫ్ చేయాలి. ఫోన్ చార్జింగ్ పూర్తయ్యాక చార్జర్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

రమేష్ బాబు, టీఎస్ఎన్‌పీడీసీఎల్, ఎస్ఈ



వినియోగదారులు వేసవిలో విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. గృహజ్యోతి వినియోగ దారులు విద్యుత్ 200 యూనిట్ల కంటే ఎక్కువగా వాడితే బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. బిల్లుల భారం నుంచి వినియోగదారులు గట్టెక్కాలంటే పొదుపుగా వాడుకోవడమే సులభమైన మార్గం.

ఎట్టకేలకు మోతె వాగుకు నీరు

- ఫలించిన ఎమ్మెల్యే ప్రయత్నం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

గంగాధర/రామడుగు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పంటలు ఎండిపోతున్న తరుణంలో ఎట్టకేలకు మోతె వాగులోకి నీటి సరఫరా ప్రారంభమైంది. మాట ఇచ్చిన ప్రకారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో మాట్లాడి నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి మోతెవాగుకు నీటినిసరఫరా చేయించారు. గంగాధర, రామడుగు మండలవాగుల్లో నుంచి నీరు పారుతోంది. రెండు మండలాలకుచెందిన ఆయకట్టు రైతులు ఆదివారం మత్తడివద్ద ప్రస్తుతం వస్తున్న ప్రవాహాన్ని మరికొంత పెంచారు. దీంతో ఎల్లంపల్లినీరు లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, రామడుగు, షానగర్, కొరటపల్లి, గోలిరామయ్యపల్లి, మోతె, కొక్కెరకుంట, వన్నారం మీదుగా కరీంనగర్ మండలానికి చేరింది. వాగుకు నీరు రావడంతో ఆయకట్టు గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి వస్తున్న నీరు

సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు..

కొన్ని రోజులుగా మోతే వాగుకు వరద కాలువ నుంచి రావాల్సిన నీరు ఆగిపోవడంతో రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. దీంతో షానగర్, కోటపల్లి, గోలీరామయ్యపల్లి మోతె కొక్కరకుంట, వన్నారం గ్రామాల్లో పొట్ట దశకు చేరుకున్న వరి పంట ఎండిపోతుండటంతో రైతులు ఆవేధనకు గురయ్యారు. మరో రెండురోజుల్లో నీరు రాకుంటే మొత్తం పంటలు ఎండి పోతాయని గగ్గోలు పెట్టారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సాగునీరు అందించి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. దీంతోఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సోమవారం నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటివిడుదల చేయించగా మోతె వాగులోనికి నీరువచ్చి చేరింది. చాలా రోజుల తర్వాత వాగులో నీరు ప్రవహించడంతో రైతుల కళ్లలో ఆనందం కదలాడింది. ఎండిపోయిన పంటలకు జీవం పోసినట్టు అయిందని రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

దొరికిన నగదు అప్పగింత

- నిజాయితీ చాటుకున్న పంచాయతీ కార్యదర్శి

కరీంనగర్ క్రైం. మార్చి 3(ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గుండి గ్రామంలో పంచాయతీ సెక్రెటరీగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్ సోమవారం విధులకు హాజరయ్యేందుకు కరీంనగర్‌నుంచి వెళ్తుండగా రామడుగు శివారులో కొత్తగా నిర్మించిన బ్రిడ్జివద్ద యాభైవేల రూపాయల నగదు దొరికింది. విషయాన్ని స్థానికఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఎమ్మెల్యే పోలీసులకు సమాచారం అందించారు. నగదు పోగొట్టుకు న్నది రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన గంగు ఎల్లయ్యగా పోలీసులు గుర్తించారు. చీర్లవంచ గ్రామంలో నిర్మించిన పెద్దమ్మతల్లి దేవాలయానికి విగ్రహాల కొనుగోలు కోసం ఎల్లయ్య రామడుగుకు వస్తుండగా మార్గమధ్యలో డబ్బును పోగొట్టుకున్నాడు. కరీం నగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ బాధితుడు గంగు ఎల్లయ్యకు నగదు అందజేశారు. కార్యక్రమంలో చొప్పదండి సీఐ ప్రకాష్, రామడుగు ఎస్సై శేఖర్ ఉన్నారు.

కారును ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

గన్నేరువరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి స్టేజివద్ద రాజీవ్ రహదారిపై సోమవారం ఓవర్‌టేక్‌చేసి వెళ్తున్న కారును వెనుకభాగంలో బస్సు ఢీకొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సిజి19ఎఫ్6300 నంబర్ గల ప్రైవేట్ బస్సు, సిద్ధిపేటకు చెందిన ఏపీ29 ఏడబ్ల్యూ 4569 నంబర్‌గల కారు రెండు సిద్దిపేట నుంచి కరీంనగర్‌కు వెళుతున్నాయి. గుండ్లపల్లి స్టేజికి రాగానే కారు డ్రైవర్ బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో కారు వెనుక భాగంలో బస్సు ఢీకొట్టింది. దీంతో కారు అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడి ధ్వంసమైంది. కారులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.



గుండ్లపల్లిలో బోల్తాపడిన కారు

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి,మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున హైనాదాడిలో లేగదూడ మృతిచెందింది. బాధితరైతు చీకట్ల రాజు కథనం ప్రకారం.. సోమవారం వేకువ జామున బావివద్దకు వెళ్లే సరికి హైనా లేగదూడపై దాడి చేస్తోంది. తాను కేకలు వేయడంతో హైనా అక్కడినుంచి వెళ్లి పోయింది. తీవ్రంగా గాయపడిన లేగదూడ కొద్ది సేపటికి మృతిచెందింది. దీనిపై పూర్తి నివేదికను ఉన్నతఅధికారులకు అందించి బాధితరైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఫారెస్టు అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కోనరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కీచక టీచర్ బ్రహ్మంను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి సిహెచ్ జనార్దన్ రావు తెలిపారు. కోనరావుపేట మండలం నిజా మాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న బ్రహ్మం విద్యార్థులపట్ల అసభ్యంగా ప్రవ ర్తించడంతో ఇటీవల పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. కాగా జిల్లా విద్యాధికారి సోమవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు అధికారులు తెలిపారు.

చిన్నరాతుపల్లిలో చోరీ

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరులేని సమయంలో దొంగలుపడి బంగారం, వెండి ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని చిన్నరాతుపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మద్దెల రాజేందర్ కుటుంబసభ్యులు ఇంటి సమీపంలో వివాహం ఉండడంతో తాళం వేయకుండ వెళ్లారు. వివాహం అనంతరం రాజేందర్ భార్య మంగ ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. వెంటనే బీరువా వద్దకు వెళ్లగా బీరువా తలుపులు తీసి ఉన్నాయి. దొంగలు బీరువాలోని తొమ్మిదిన్నర తులాల బంగారం, 8 తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. రాజేందర్ భార్య మంగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై వెంకటేశ్వర్ చేరుకొని డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు స్వీకరించి కుటుంబ సభ్యులను విచారించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మైలారం పల్లెప్రకృతి వనంలో చెట్లు దగ్ధం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు



దగ్ధమైన చెట్లను పరిశీలిస్తున్న అధికారులు

గన్నేరువరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలోని పల్లెప్రకృతి వనంలో రెండు వందల చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. మండలంలోని మైలారం గ్రామశివారులో పది ఎకరాల స్థలాన్ని పల్లెప్రకృతి వనానికి కేటాయించారు. అప్పటి సర్పంచ్ దుడ్డు రేణుక మల్లేశం, సెక్రెటరీ మొక్కలు నాటించి సంరక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ప్రకృతివనంలో మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ మరికొందరు రైతులతో కలిసి అక్కడకు చేరుకొని మంట లను ఆపే ప్రయత్నం చేశారు. అప్పటికే భారీగా మంటలు వ్యాపించి చెట్లు దగ్ధమయ్యాయి. సోమవారం సంఘటనాస్థలాన్ని ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతి కార్యదర్శి చిరంజీవి, గ్రామస్థులు పరిశీలించారు. ఎవరో గుర్తుతెలియని ఆకతాయిలు నిప్పుపెట్టి ఉండవచ్చని అను మానంతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురిపై వరకట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేర్వేరుఘటనలో ఆరుగురిపై అదనపు వరకట్నం కేసు నమోదుచేశామని ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ సోమవారం తెలిపారు. ఆయన కథనంమేరకు.. మండల కేంద్రానికి చెందిన దున్నపోతుల రాజుకు ముస్తాబాద్‌లోని లావణ్యతో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో పుట్టింటి వారు రూ.4 లక్షల నగదు, బంగారు ఆభరణాలు ఇచ్చి లాంఛనంగా పెళ్లి జరిపించారు. కొన్ని రోజులుగా పుట్టింటి నుంచి రూ.లక్ష అదనంగా కట్నం తీసుకురావాలని భర్త రాజు, అత్త కనకవ్వ వేధింపులకు గురిచేశారు. లావణ్య ఫిర్యాదుతో రాజు, అత్త కనకవ్వలపై కేసు నమోదు చేశారు.

- రాజన్నపేట చెందిన ఎర్రోళ్ల రేఖకు గంభీరావుపేట మండలం కొత్తపల్లిలోని రమేష్‌తో 16ఏళ్ల క్రితం వివాహమైంది. రూ.5లక్షల నగదు 9తులాల బంగారం ఇచ్చి పెళ్లి జరిపించారు. ఆరేళ్లుగా భర్త రమేష్‌తో పాటు ఆడపడుచులు నేతరి కిట్టవ్వ, ఆరేల్లి శాంతవ్వ, నర్సవ్వ పుట్టింటి నుంచి రూ.5లక్షల అదనపువరకట్నం తీసుకురావాలని రేఖను మానసికంగా వేధింపులకు గురిచేశారు. దాంతో బాధితురాలు రేఖ పోలీసులకు ఫిర్యాదుచేసింది. భర్త రమేష్, ఆడపడుచులు కిష్టవ్వ శాంతవ్వ, నరసవ్వపై వరకట్నం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు సమీపంలో కరీంనగర్-వరంగల్ రోడ్డుపై బైక్ అదుపుతప్పి ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం రాజపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఫైమద్ కేశవపట్నంకి వచ్చి తనస్వగ్రామం రాజపల్లికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొత్తగట్టు గ్రామం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనితల, మోకాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు బోల్తా.. ఒకరికి గాయాలు

రామగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల బొక్కల వాగు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో సాత్విక్ అనే సింగరేణి కార్మికుడు గాయపడ్డాడు. మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి కల్వచర్ల బొక్కల వాగు మూలమలుపులో కారు అదుపు తప్పడంతో బ్రిడ్జికి సమీపంలో గల పొలంలోకి దూసుకెళ్ళి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న సాత్విక్‌కు భుజం వద్ద ఎముక విరిగిపోయినట్లు తెల్సింది. కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో త్రుటిలో ప్రాణాపాయం తప్పించుకున్నారు.

సైబర్ నేరాలకు పాల్పడుతున్న నలుగురి అరెస్ట్

- ఆన్‌లైన్ సెంటర్లు కేంద్రంగా రూ.30 లక్షలకు పైగా మోసాలు
- భీవండి కేంద్రంగా సాగుతున్న సైబర్ దందా
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠాలో నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లాపోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సైబర్‌మోసాలకు పాల్పడిన ముఠా వివరాలను ఆయన వెల్లడించారు. కరీంనగర్‌జిల్లా రామడుగు మండలంలోని వెదిర గ్రామానికి చెందిన దాసరి మురళి(45) భీవండికేంద్రంగా ఉంటూ చిరాగ్ రమేశ్ పెథాడ్(25), విలేష్‌పటేల్(30), జితేంద్ర సోమాభాయ్ (43), నీలేష్ జైసింగ్34)తో ఓ ముఠాగా ఏర్పడి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వీరిపై దేశవ్యాప్తంగా ఎస్‌సిఆర్‌పిలో 54కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ముఠా రూ.30లక్షలకు పైగా సైబర్‌మోసాలకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. ఈముఠాలో చిరాగ్ రమేశ్ పెథాడ్, విలేష్ పటేల్, జితెంద్ర సోమాభాయ్, నీలేష్ జైసింగ్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మహారాష్ట్రలోని భీవండికి చెందిన దాసరి మురళి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపించుకుంటూ వచ్చిన డబ్బుతో జీవనం సాగించగా విలాస జీవితాలకు అలవాటుపడి ఎలాగైనా సులభమార్గంలో డబ్బులు సంపాదించాలని తన స్నేహితులైన విలేష్ పటేల్, చిరాగ్ రమేశ్ పెతాడ్, జితెంద్ర సోమాభాయ్, నిలేష్ జైసింగ్ అనే వ్యక్తులతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారన్నారు. మురళి ఆన్‌లైన్ సెంటర్‌లను లక్ష్యంగా చేసుకొని మొదటగా నిర్వాహకులకు కాల్ చేసి తనని తాను ఒక ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తిగా పరిచయం చేసుకుంటాడన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు ఎక్కువగా ఉంటాయని, మా సభ్యులతో నగదు డబ్బులు పంపిస్తానని నమ్మించి ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్‌చేయాలని చెప్పి స్నేహితులైన నలుగురి అకౌంట్ లలోకి వెళ్లేలా ప్రణాళిక చేసుకుంటారన్నారు. ఈ విధంగా వచ్చిన డబ్బును ఐదుగురు పంచుకుంటూ మోసాలకు పాల్పడుతుంటా రన్నారు. ఇదేవిధంగా వేములవాడ పట్టణపరిధిలోని అగ్రహారంలో గల ఒక ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు ఇనుకొండ మహేశ్‌ను, సిరిసిల్లలోని ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్ నిర్వాహకుడిని మోసం చేశారన్నారు. వీరిద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, సైబర్‌సెల్ టీం జునైద్, గంగిరెడ్డి, మహేశ్, టౌన్ ఎస్సై ప్రేమానందం, సంపత్‌తో ప్రత్యేకబృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారన్నారు. దర్యాప్తులో భాగంగా సాంకేతికత ఆధారంగా భీవండిలో నలుగురు వ్యక్తులను అరెస్ట్‌చేశారని, పరారీలో ఉన్న దాసరి మురళిని త్వరలో పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. వీరిపై 100కు పైగా ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈముఠాకు ప్రధానపాత్ర వహించిన గుజరాత్‌కు చెందిన కీలకనిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ సైబర్‌మోసాలకు పాల్పడిన ముఠాను పట్టుకోవడంలో ప్రధానపాత్ర వహించిన టౌన్‌సీఐ వీరప్రసాద్, ఎస్సైలు ప్రేమనందం, సంపత్, సైబర్‌సెల్ టీం జునైద్, గంగిరెడ్డి, మహేశ్‌ను ఎస్పీఅభినందించారు. సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పాల్గొన్నారు.



సైబర్ నేరాలకు పాల్పడిన వారిని అరెస్ట్ చూపుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం



- మొత్తం సామర్థ్యం 80.5 టీఎంసీలు
- ప్రస్తుత నీటి నిల్వ 32.138 టీఎంసీలు
- ప్రతీ రోజు 0.5 టీఎంసీలు ఖాళీ
- కాకతీయ కాలువకు 3వేల క్యూసెక్కులు విడుదల
- నీరు పొదుపుగా వినియోగించాలంటున్న అధికారులు

జగిత్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డ్యామ్‌లో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. డ్యామ్ పరిధిలోని పలు జిల్లాలకు ఆయకట్టు నీరు విడుదల కొనసాగుతుండడం, ఎండలు ముదురుతుండడం, పలు జిల్లాలకు మిషన్ భగీరథ పథకం కింద తాగునీటికి సైతం ఎస్సారెస్పీ జలాలను వినియోగిస్తుండడంతో నీరు రోజురోజుకూ తగ్గుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో రోజుకు సుమారు 0.5టీఎంసీల నీరు కాలువల ద్వారా వెళ్లిపోతోంది. ఎస్సారెస్పీలో 80.5 టీఎంసీల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 32.138 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎండల తీవ్రత కారణంగా ప్రతీ నిత్యం దాదాపుగా 479 క్యూసెక్కుల నీరు ఆవిరైపోతున్నట్లు అధికారుల అంచనాలున్నాయి. వచ్చే ఏప్రిల్, మే మాసాల్లో నీటి నిల్వ మరింత తగ్గే ప్రమాదం ఉంది.

పెరుగుతున్న నీటి వినియోగం

ప్రస్తుత యేడాది యాసంగి ఆరంభంలో ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను 80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కొన్ని రోజులుగా ఎస్సారెస్పీ పరిధిలోని ఆయకట్టుకు నీటిని కాలువల ద్వారా విడుదల చేస్తున్నారు. దీంతో నీటి మట్టం రోజురోజుకూ తగ్గుతోంది. ప్రస్తుత సీజన్‌లో ప్రాజెక్టు పరిధిలో పంటల సాగుకు ప్రభుత్వం 60 టీఎంసీల నీరు అవసరమని అంచనా వేసింది. ప్రస్తుతం సుమారు 45 టీఎంసీల నీరును విడుదల చేశారు. ఆయకట్టు పరిధిలో పంటల సాగుకు మరో 15 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. ఎండలు ముదురుతుండడంతో అంచనాకు మించి నీరు వినియోగం అవుతోంది.

కొనసాగుతున్న సాగు నీటి విడుదల

ఎస్సారెస్పీ డ్యామ్ నుంచి నిర్ణీత ప్రణాళిక ప్రకారం నీరు విడుదల చేస్తున్నారు. వారబందీ ప్రకారం ఏడు రోజులు నీటిని విడుదల చేస్తూ ఎనిమిది రోజులు నిలిపివేస్తూఎగువ మానేరు వరకు తరలిస్తున్నారు. గతేడాది డిసెంబరు 25వ తేదీ నుంచి ప్రస్తుత యేడాది ఏప్రిల్ 3వ తేదీ వరకు నీటిని అందించే విధంగా అధికారులు ప్రణాళిక ఖరా రు చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు, సరస్వతీ కాలువ ద్వారా నిర్మల్, లక్ష్మీ కాలువ ద్వారా నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం పరిదిలోని ప్రాంతాలకు నీటిని అంది స్తున్నారు. ప్రస్తుతం కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, సరస్వతీ కాలువ ద్వారా 700 క్యూ సెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తు న్నారు. వరద కాలువకు 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వారబందీ పద్ధతిలో..

వారబందీ (ఆన్ అండ్ ఆఫ్) పద్ధతిలో ఎస్సారెస్పీ నీటి విడుదల జరగనుంది. ఎనిమిది రోజుల పాటు ఆన్, 7 రోజుల పాటు ఆఫ్ పద్ధతి లో నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా ఏడు తడులుగా నీరు విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా డీ-5 నుంచి డీ-53 కాలువకు ఏడు రోజులు, డీ-53 నుంచి డీ-94 వరకు కాలువలకు ఎనిమిది రోజులు 500 క్యూసెక్కు ల నీటిని వదులుతు న్నారు. అంతేగాకుండా కాకతీయ కాలువ ఆధారంగా పంపు సెట్‌లు అమర్చుకున్న రైతుల కు నీరు అందించేందుకు ప్రతీ రోజు 500 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నారు.

మిషన్ భగీరథ పథకానికి..

ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు మిషన్ భగీరథ పథకానికిగా నూ నిత్యం 231 క్యూసెక్కుల శ్రీరాంసాగర్ జలాలను వినియోగిస్తున్నా రు. డ్యామ్ పరిధిలోని జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో గల మిషన్ భగీరథ ట్యాంకులకు విడుదల చేస్తున్నా రు. జగిత్యాల, కోరుట్ల మిషన్ భగీరథ పథకానికి ప్రతీ నిత్యం 61 క్యూసె క్కులు, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు 63 క్యూసెక్కులు, నిజామా బాద్, కామారెడ్డి జిల్లాలకు 107 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సగటున ప్రతీ రోజు 8,578 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

గత యేడాదితో పోలిస్తే..

గత యేడాదితో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం స్వల్పంగా ఎక్కువగా ఉంది. గత యేడాది మార్చి మొదటి వారంలో ప్రాజెక్టులో నీటి మట్టం 28.871 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 32.138 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత కారణంగా సాగు, తాగు నీటి వినియోగం మరింత పెరగనుంది. ఎండలకు నీరు ఆవిరి కానుండడం వల్ల పొదుపుగా వినియోగించుకోవాలని ఎస్సారెస్పీ అధికారులు కోరుతున్నారు.



జిల్లాలో కాలువల ద్వారా సాగు నీరు ఇలా..

జిల్లాలో ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఇబ్రహీంపట్నం మండలం నుంచి పెగడపల్లి మండలం వరకు సుమారు 91వ కిలోమీటర్ల మేర కాకతీయ కాలువ ప్రవహిస్తోం ది. ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు విడుదల చేస్తున్న నీరు 25వ కిలోమీటరు వద్ద జగిత్యాల జిల్లాలో ప్రవహిస్తోంది. 116వ కిలో మీటరు వద్ద ముగుస్తోంది. జిల్లాలోని వివిధ గ్రామాలకు కాకతీయ కాలువకు అనుబంధంగా ఉప కాలువలను నిర్మించి నీరు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో డీ-21 ఉప కాలువ నుంచి డీ-83 వరకు 62 డిస్ట్రిబ్యూటర్ కాలువలు ఉన్నాయి. ఒక్కో డిస్ట్రిబ్యూటరీకి ఆయకట్టును బట్టి ఎడమ, కుడి వైపులకు మరో 50 వరకు కాలువలు ఉంటాయి. సంబంధిత మైనర్ కాలువల ద్వారా సాగునీరు పంట పొలాలకు అందిస్తున్నారు. జిల్లాలో దాదాపుగా ఎస్సారెస్పీ ద్వారా 1.70 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలకు సమీపంలో ఉండే చెరువులు, కుంటలు నింపేందుకు తూములు ఏర్పాటు చేయడం వల్ల సుమారు మరో లక్ష ఎకరాలకు ఎస్సారెస్పీ సాగు నీరు అందుతోంది.

ఐడియా.. అదుర్స్!



మ్యాడంపల్లిలో దోస పంట వద్ద రైతు ఏర్పాటు చేసిన మైక్

మల్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కోతుల బారి నుంచి పంటలను రక్షించుకోవడానికి మల్యాల మండలం మ్యాడం పల్లిలో దోస సాగు చేస్తున్న రైతులు పంట చేల వద్ద మైకులు ఏర్పాటు చేశారు. రికార్డు చేసిన కుక్కల అరుపులతో కూడిన శబ్దాలకు కోతులు పంట చేల వద్దకు రావడం లేదు. దీంతో కోతులు పంటల వైపు రావడం లేదని రైతులు చెబుతున్నారు.

త్వరలోనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మనోజ్ కుమార్‌గుప్తా



సలాన్ని పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

జమ్మికుంట రూరల్, మార్చి 3((ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వేస్టేషన్లో జమ్మికుంట- కొత్త పల్లి మధ్య ఉన్న మూడో రైల్వే ట్రాక్‌పై ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్న ట్లు రామగుండం అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మనోజ్ కుమార్‌గుప్తా అన్నారు. సోమ వారం ఆయన రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ప్రయాణికులను సమ స్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మూడో ట్రాక్ లైన్ నిర్మాణం పూర్తైన తర్వాత ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను పలువురు రైల్వే ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ సూచన మేరకు తాము సర్వే చేశామని, అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నా మని తెలిపారు. కొత్తపల్లివైపు టికెట్‌బుకింగ్ కౌంటర్, ఎస్కలేటర్ ఏర్పా టు చేయాలని ప్రజలు కోరుతున్నారని, అందుకు నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అసంపూ ర్తిగా ఉన్న ఉప్పల్ ఆర్వోబీ, బావుపేట నూతన ఆర్వోబీ నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రబెల్లి సంపత్‌రావు, శీలం శ్రీనివాస్, జీడి మల్లేష్, మోతే స్వామి, ఇటికాల స్వరూప, పల్లపు రవి, కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంక న్న, సలీంపాషా, తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నా స్పందన కరువు

మేడారంలోని లెఫ్ట్ కెనాల్‌ను పరిశీలించిన మాజీ మంత్రి కొప్పుల



కెనాల్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నా రు. సోమవారం మేడారంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన లెఫ్ట్ కెనాల్ ను ఆయన పరిశీలించారు. ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండల రైతుల కోసం 2022లో రూ.13 కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం పనులు చేస్తే అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న మీరెందుకు పూర్తి చేయలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా హయాంలో ఎక్క డైన ఎండిన చెరువులు, కుంటలు కనిపించాయా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ మార్క్, ధర్మపురిలో కొప్పుల మార్క్ ఎవరో చెరిపేస్తే చెరిగి పోయేవి కావన్నారు. మా హయాంలో ఎక్కడైన ఎండిన చెరువు లు, కుంటలు కనిపించాయా అని ప్రశ్నించారు. ఇప్పుడు నీరు లేక పం టలు ఎండిపోతుంటే ఎమ్మెల్యేకు కనిపించడం లేదా ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మపురి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఎండిన పొలాలు, ఎరువులు లేక రైతుల క్యూలైన్లలో పడిగాపులు కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని, ప్రతి పక్షంలో ఉన్నప్పుడు లెఫ్ట్ కెనాల్ ఆపాలని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. లెఫ్ట్ కెనాల్ పూర్తయితే 15 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందనే లక్ష్యంతో పనులు చేపడితే అవి పూర్తి చేయలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం కెనాల్ పనులను పూర్తిచేసి ఎండుతున్న పొలాలను కాపాడాలని కోరారు. బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బల రాంరెడ్డి, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పూస్కూరి జితేందర్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఆవుల శ్రీనివాస్, గుర్రం మోహన్‌రెడ్డి, పాకల రాజయ్య, కొత్త మోహన్, కూర పాటి శ్రీనివాస్, ఎండీ సలాం, దేవి నళినికాంత్, మంద శ్రీనివాస్, గుర్రం తిరుపతి, ఆవుల వేణు తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల స్థానంలో కొనసాగుతున్న ఉత్కంఠ



కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

(5వ పేజీ తరువాయి)

లెక్కింపును ప్రారంభించారు. పట్టభద్రుల ఓట్లను లెక్కించేందుకు 21 టేబుళ్లను ఏర్పాటు చేశారు. పట్ట భద్రుల ఓట్లలో చెల్లని ఓట్లు, చెల్లిన



బ్యాలెట్ పత్రాలను కట్టలు కడుతున్న సిబ్బంది

ఓట్లను వేరుచేసే ప్రక్రియ రాత్రి వరకూ పూర్తికాలేదు. ఎన్నికల రిట ర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు తాత్కాలికంగా నిలిపివేసి ఉపాధ్యా య ఓట్ల లెక్కింపు ప్రక్రియను వేగ వంతం చేశారు. దీంతో టీచర్ ఎమ్మెల్సీ మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు రాత్రి తొమ్మిది గంటల వరకు పూర్తయింది. మొదటి ప్రాధా న్య ఓట్లలోనే బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య కోటా ఓట్ల కంటే అధి కంగా 878 ఓట్లు రావడంతో ఆయన గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటించారు. అ తర్వాత తిరిగి పట్టభద్రుల ఓట్ల లెక్కింపు ప్రక్రియను కొనసాగించారు.

వివిధ రకాలుగా చెల్లని ఓట్లు

బ్యాలెట్ పత్రాల్లో తమకు నచ్చిన వారికి ప్రాధాన్య క్రమంలో ఓటు హక్కు వేయాల్సి ఉండగా చాలా మంది ఓటర్లు వారికి నచ్చిన విధంగా నంబర్లు వేశారు. నిబంధనల మేరకు లేని వాటిని చెల్లని ఓట్లుగా నిర్ధారిం చారు. ప్రాధాన్య క్రమంలో నచ్చిన అభ్యర్థికి ముందు 1 అనే సంఖ్య వే యాల్సి ఉండగా, కొంత మంది ఓటర్లు 01, ఒకటి, 1 నంబర్ వేసి చుట్టూ సర్కిల్ వేశారు. ఎన్నికల అధికారులు అందించిన స్కెచ్ పెన్ వాడకుండా తమ సొంత పెన్నుతో అంకెలు వేశారు. మరికొంద రు రైట్ మార్కు వేశారు. వీటన్నింటిని ఎన్నికల అధికారులు చెల్లని ఓట్లుగా తేల్చారు.

చెల్లని ఓట్లతో అభ్యర్థుల ఆందోళన

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో భారీ సంఖ్యలో చెల్లని ఓట్లు పడ్డాయి. చెల్లని ఓట్లతో ఫలితాలు తారుమా రు అయ్యే అవకాశముం టుందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్య హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓట్లతో గెలుపు కష్టమేనని చెబుతున్న నేపథ్యంలో చెల్లని ఓట్లు ఎవరికి నష్టం కలిగిస్తా యో, ఎవరికి లాభం చేస్తాయో చెప్పలేని స్థితిలో అందరిలో టెన్షన్ మొదలైంది. కౌటింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్లకు అవగాహన లేకపోవడం తోనే చెల్లని ఓట్లు పోలయ్యాయని అభిప్రాయపడ్డారు.

జంబో బ్యాలెట్‌తో జాప్యం

పట్టభద్రుల స్థానంలో 56 మంది అభ్యర్థులు పోటీ చేశారు. 2,50,106 ఓట్లు పోలయ్యాయి. అసలే జంబో బ్యాలెట్లు, భారీగా ఓట్లు పోలవ్వడంతో ఓట్ల లెక్కింపులో జాప్యం జరుగుతోంది. చెల్లిన, చెల్లని ఓట్లను వేరు చేయడానికే చాలా సమయం పట్టింది. రాత్రి 9 గంటల వరకు లక్ష ఓట్లను విభజన ప్రక్రియ పూర్తిచేయగా అందులో 92,000 ఓట్లు చెల్లు బాటయ్యాయి. 8,000 ఓట్లు చెల్లుబాటు కాలేదు. మరో 1,50,000 ఫైచిలుకు ఓట్లను వేరు చేయాల్సి ఉంది. 25 ఓట్లకు ఒక బెండల్‌ను కట్టి, ఆ తర్వాత ఓట్లను లెక్కిస్తారు. 25 చొప్పు ఓట్ల కట్టలు కట్టే ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం వరకు పూర్తయ్యే అవకాశ ముంది. ఆ తర్వాత నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవు తుంది. లక్ష ఓట్లలోనే ఎనిమిది వేల ఓట్లు చెల్లని విగా గుర్తించారు. మిగతా 1,50,000 ఓట్లు వేరు చేస్తే చెల్లని ఓట్ల సంఖ్య దాదాపు 20 వేల వరకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో ప్రధాన పార్టీ అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవు తున్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కొంత మంది స్వతంత్ర అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చి ఓటర్లకు అవగా హన కల్పించక పోవడంతోనే అధికంగా ఓట్లు చెల్లని ఎక్కువగా పడ్డా యని, తిరిగి ఎన్నికలు నిర్వహించాలంటూ నినాదాలు చేశారు. పట్ట భద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రస న్న హరికృష్ణ ఎక్కువగా చెల్లని ఓట్లు ఉండడం బాధాకరమని, ఓటర్లకు మరింత అవగాహన కల్పిస్తే చెల్లని ఓట్ల సంఖ్య తగ్గేదని అన్నారు.

ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య

(5వ పేజీ తరువాయి)

అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన ఓట్ల లెక్కిం పు ప్రక్రియ రాత్రి 9 గంటలకు ముగి సింది. నియోజకవర్గంలో 27,088 మంది ఓటర్లు ఉండగా 24,968 మంది మరో 73 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును విని యోగిం చుకున్నారు. మొత్తం పోలైన 25,041 ఓట్లు పోల్‌కాగా 897 ఓట్లు చెల్లకుండా పోయాయి. 24,144 ఓట్లు చెల్లుబాటు కాగా అభ్యర్థి గెలుపొందడానికి 12,081 కోటా ఓట్లుగా గుర్తించారు. బీజేపీ అభ్యర్థి మల్క కొము రయ్య మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు లోనే కోటా ఓటుకు మించి ఓట్లు పోల య్యాయి. దీంతో ఆయనను మొదటి ప్రాధాన్య ఓటుతోనే గెలుపొంది నట్లుగా ప్రకటించారు.

మల్క కొమురయ్యకు 12,959 ఓట్లు రాగా ఆయన సమీప పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి 7182 ఓట్లు వచ్చా యి. బీజేపీ అభ్యర్థి మల్క కొముర య్యకు పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మరో అభ్యర్థి వై అశోక్‌కుమార్ మధ్య పోటీ ఉం టుందని అందరూ భావించగా అంచనాలను తారుమారు చేస్తూ కొముర య్య మొదటి ప్రాధాన్య ఓట్లలోనే 5,777 ఆధిక్యంతో గెలుపొంది సంచలనం సృష్టించారు.

ఫలించిన వ్యూహం

బీజేపీ అధిష్ఠానం ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి అనుకున్న ఫలితం సాధించింది. మిగతావారికంటే ముందుగా జనవరిలోనే అభ్యర్థులను ప్రకటించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య బరిలోకి దింపింది. ఆయన విజయం కోసం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఇతర నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వ హించారు. ఘన విజయం సాధించారు.



మల్క కొమురయ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ఓట్ల వివరాలు

క్రసం.	అభ్యర్థి	పోలైన ఓట్లు
1.	మల్క కొమురయ్య (తపస్/బీజేపీ)	12,959
2.	వంగ మహేందర్‌రెడ్డి (పీఆర్టీయూ)	7,182
3.	అశోక్‌కుమార్	2,621
4.	కూర రఘోత్తంరెడ్డి	428
5.	తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి	320
6.	యాటకారి సాయన్న	293
7.	మామిడి సుధాకర్‌రెడ్డి	153
8.	ఎల్ సుహాసిని	78
9.	గువ్వల లక్ష్మీ	41
10.	ముత్తారం నర్సింహస్వామి	31
11.	కంటె సాయన్న	12
12.	జగ్గు మల్లారెడ్డి	10
13.	సిలివేరు శ్రీకాంత్	7
14.	చిలుక చంద్రశేఖర్	6
15.	విక్రమ్‌రెడ్డి	3
మొత్తం ఓట్లు		24,144
చెల్లని ఓట్లు		897
పోలైన ఓట్లు		25,041

మల్క కొమురయ్య నేపథ్యం



ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించిన మల్క కొమురయ్య పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని బంధంపల్లికి చెందిన వారు. 66 ఏళ్ల మల్క కొమురయ్య హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో బీఈ చదివిన ఆయన హైదరాబాద్, పెద్దపల్లి, నిర్మల్‌లో పల్లవి విద్యా సంస్థలు స్థాపించారు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు. మొదటి నుంచి ఆయన సంఘ్ కార్యకర్తగా పని చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో సన్నిహిత సంబంధాలు న్నాయి. ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో ఉన్న పరిచయాలు, సంఘ్ కార్యకర్తగా పని చేయడం ఆయనకు లాభించింది.

ఎక్కువ చెల్లని ఓట్లు పడడం బాధాకరం

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి



కరీంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఊహించిన దాని కంటే ఎక్కువగా చెల్లని ఓట్లు పడ్డాయని పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరు ద్ధంగా ఓట్లు వేయడంతో వాటిని చెల్లని ఓట్లుగా పరిగణించారని అన్నారు. మొదటి ప్రాధాన్య ఓట్లు ఎక్కువగా ఎవరికి పడ్డాయో వారికే చెల్లని ఓట్లు వచ్చే అవకాశాలుంటాయని అభిప్రాయపడ్డారు. పోలింగ్ కేంద్రంలో ప్రత్యేకంగా స్కెచ్ పెన్ ఇచ్చినప్పటికీ కొంతమంది ఓటర్లు సొంత పెన్నుతో నంబర్లు వేశారని, అలాంటి వాటిని చెల్లని వాటిగా తొలగిం చారని చెప్పారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 10 శాతానికి పైగా చెల్లని ఓట్లు ఉండడం బాధాకరమని అన్నారు. ఓటర్లు హడావుడిగా, టెన్షన్ తో ఓటు వేయడంతో ఈ తప్పులు జరిగాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ పట్టభద్రుల ఓటర్లకు మరింత అవగాహన కల్పించి ఉంటే బాగుండేదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న సరళిని బట్టి చూస్తే తన విజయం ఖాయమనే ధీమాను వ్యక్తం చేశారు.

అవగాహన లోపంతోనే చెల్లని ఓట్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



కరీంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):ఎన్నికల కమిషన్, అధికారయంత్రాంగం ఓటర్లకు అవగాహన కల్పించక పోవడంతోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లలో అధికంగా చెల్లని ఓట్లు వస్తున్నాయని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికంగా చెల్లని ఓట్లు వచ్చాయన్నారు. కావాలని ఎవరూ ఓట్లు చెల్లకుండా వేయరని, అవగాహనా రాహిత్యం వల్లనే ఇలా జరిగిందని అన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, ఓట్ల విభజన ప్రక్రియ సాయంత్రం వరకూ పూర్తికాలేదన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ట్రెండ్ తెలియవచ్చని ప్రసన్న హరికృష్ణ అభిప్రాయపడ్డారు.

రీ పోలింగ్ నిర్వహించాలంటూ స్వతంత్ర అభ్యర్థుల నిరసన

కరీంనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెల్లని ఓట్లు అధికంగా పడ్డందున తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థులు డిమాండ్ చేశారు. సోమవారం సాయం త్రం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో పలువురు స్వతంత్ర అభ్యర్థులు నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సం దర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన శంకర్ రావుతోపాటు మరికొందరు స్వతంత్ర అభ్యర్థులు మాట్లాడుతూ ఇప్ప టి వరకు జరిగిన ఓట్ల లెక్కింపు సరళిని బట్టిచూస్తే కౌంటింగ్ పూర్తయ్యే వరకు భారీ సంఖ్యలో ఓట్లు చెల్లకుండా పోతాయని, ప్రతి పది ఓట్లలో మూడు, నాలుగు చెల్లని ఓట్లు ఉన్నాయన్నారు. చెల్లని ఓట్లు ఎక్కువగా ఉండడానికి కారణం ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన కల్పించక పోవడమేనని విమర్శించారు. ప్రభుత్వం, ఎన్నికల యంత్రాగం ఎన్నికలపై దృష్టిసారించిందే కానీ ఓటర్లకు అవగాహన కల్పించ లేదని వారు విమర్శించారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఓట రు లిస్టును ఇవ్వలేదని, స్వతంత్ర అభ్యర్థులు ఓటర్ల లిస్టు కావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారిని అడిగితే 98 వేల రూపాయలను చెల్లించాలని సూచించారన్నారు. కనీసం ఓటరు లిస్టు లేకుండా జరిగిన ఈ ఎన్నిక అప్రజాస్వామికమని వారు ఖండించారు.



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

ఈ విజయం ఉపాధ్యాయులకు, మోదీకి అంకితం

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపును ఉపాధ్యాయులకు, ప్రధాని మోదీకి అంకితమిస్తున్నామని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీగా గెలుపొందిన మల్క కొమురయ్య ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారన్నారు. కొమురయ్య 5,900 ఓట్ల తేడాతో భారీ విజయం సాధించారన్నారు. ఇటీవల బడ్జెట్‌లో ఉపా ధ్యాయులు, ఉద్యోగులకు పన్ను మినహాయింపుపై తీర్పు ఇచ్చారన్నారు. 317 జీవోపై బీజేపీ కార్యకర్తలు చేసిన పోరాటాలు గుర్తుంచుకున్నార న్నారు. తపస్ చిన్న సంస్థ అని హేళన చేసిన వారికి చెంప పెట్టులా తీర్పు ఇచ్చారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కై బీజేపీ అభ్యర్థి కొముర య్యను ఓడించాలని కుట్రలు చేశారన్నారు. కిషన్‌రెడ్డి నాయకత్వంలో ఇది మూడో విజయమన్నారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ఒక టీచర్ ఎమ్మెల్సీ గెలిచామని, పట్టభద్రుల స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

కార్యకర్తల కృషి, తపస్ సహకారంతోనే గెలిచా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

ఉపాధ్యాయ స్థానంలో ఎమ్మెల్సీగా గెలుపొందిన మల్క కొమురయ్య మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తల కృషి, తపస్ సహకారం వల్లే తాను ఎమ్మెల్సీగా గెలిచానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఓటేసిన ఉపాధ్యా యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార మే తన ప్రధాన ఎజెండా అన్నారు. తన గెలుపుకు సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, నాయకులకు కృతజ్ఞత లు తెలిపారు. బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున కౌంటింగ్ కేంద్రానికి తరలి వచ్చి బండి సంజయ్‌తోపాటు, మల్క కొమురయ్యను భారీ గజమాల లతో సన్మానిం చారు. స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎస్ ప్రభాకర్ మాజీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో పొలానికి నీరు

● పంట కాపాడుకోవడానికి రైతు ప్రయత్నం



ఎల్లారెడ్డిపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు రోజు రోజుకు పడిపోవడంతో వరి పంట ఎండిపోకుండా కాపాడుకోవడానికి సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో రైతు సత్తయ్య ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పోస్తున్నాడు. సత్తయ్య నాలుగు ఎకరాల్లో వరిపంట వేశాడు. రెండు బోర్లు ఉండగా ఒక బోరు ఎండి పోయింది. మరో బోరు నుంచి ధారగా నీరు వస్తోంది. భూగర్భ జలాలు అడుగం టడంతో రెండు ఎకరాలు వదిలిపెట్టి మరో రెండు ఎకరాలకు ట్యాంకర్ ద్వారా నీరు పెట్టి పంటను కాపాడుకుంటున్నాడు. ఇందు కు నీరు అందించిన వుడు రూ.5వేల వరకు ఖర్చు చేస్తు న్నాడు. మూడు రోజులకు ఒకసారి ఐదు ట్యాంకర్ల ద్వారా నీరు పెడుతున్నట్లు రైతు తెలిపాడు.



పశువులకు మేతగా వరి పంట

● సాగునీరు లేక ఎండిన పొలం



గంభీరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సాగు చేసిన పంటలను మధ్యలోనే వదిలివేస్తున్నారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట పరిధిలోని కుర్దులింగంపల్లిలో సాగునీరు అందక ఓ కౌలు రైతు వరి పంటను పశువులకు మేతగా వదిలిపెట్టాడు. గంభీరావుపేటకు చెందిన సయ్యద్ కుదరతుల్లాకు చెందిన రెండెకరాల పొలాన్ని కుర్దులింగం పల్లికి చెందిన చిప్పల నర్సింలు అనే రైతు కౌలుకు తీసుకున్నాడు. ఎండలు ముదరడంతో బావిలో నీరు తగ్గి వరి పంటకు నీరందని పరిస్థితి ఏర్పడింది. ఎకరం వరకు వరి చేను ఎండిపోవడంతో చేసిది లేక పశువులకు మేతగా పెట్టాడు. వరి సాగు కోసం అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టానని, కౌలుకు తీసుకున్న రెండెకరాల్లో ఎకరం ఎండిపోయిందని రైతు నర్సింలు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వ పరంగా తనను ఆదుకోవాలని కోరాడు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

● ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి ● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా





ట్రైసైకిల్ అందుకున్న రమేష్, వీల్‌చైర్ అందుకున్న పవన్



కలెక్టరేట్‌కు తరలివచ్చిన రగుడు డబుల్ బెడ్‌కాలనీవాసులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 3 :(అంధ్రజ్యోతి): ప్రజావాణిలో విన్న వించిన సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు తరలిరావడంతో కిటకిటలాడిపోయింది. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో 108 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూశాఖకు 45, సిరిసిల్ల మున్సిపాల్టీకి 14, జిల్లా సంక్షేమశాఖకు 6, ఉపాధి కల్పన శాఖకు 6, ఎస్‌డీసీకి 6, విద్యాశాఖకు 5, ఎస్పీ కి 4, నీటిపారుదల శాఖకు 3, వ్యవసాయశాఖకు 3, తంగళ్లపల్లి ఎంపీడీవోకు 3, డీఆర్‌డీవోకు 2, సబ్‌రిజిస్ట్రార్‌కు 2, సెస్‌కు 2, భూముల సర్వేశాఖకు 1, సీపీవోకు1, డీపీవోకు1, చేనేత జౌళీశాఖకు 1, ఎస్సీ కార్పోరేషన్‌కు 1 చొప్పున ఫిర్యాదు, వినతి పత్రాలు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపాపడంతోపాటు అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాలు అందజేత

జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి దివ్యాంగులు వచ్చి పరికరాలను అందజేయాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించి వినతి పత్రాలను అందించడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ జిల్లాసంక్షేమాధికారులను రప్పించి ఇద్దరుదివ్యాంగులకు అవసరమైన పరికాలను అందించాలని ఆదేశించడంతో వేములవాడ పట్టణంలోని సాయినగర్‌కు చెందిన లేదేళ్ల రమేష్‌కు మ్యానువల్ ట్రైసైకిల్‌తోపాటు సంకక్రలను అందించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి పవన్ పుట్టుకతోనే నడువలేని స్థితిలో ఉన్న అతనికి వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సిబ్బంది పాల్గొన్నారు.

కుమారులు, కోడళ్లు పోషించడంలేదు

- జిందం రామవ్వ, సిరిసిల్ల



సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన నాకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. నా భర్త నారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు, మా భార్యభర్తలం కలిసి సంపాందించిన అస్తులను తీసుకుని వృద్ధాప్యంలో ఉన్న నన్ను పోషించడం లేదు. దీనిపై పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి నా కుమారులు, కోడళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చి నన్ను పోషించుకునేలా చర్యలు తీసుకోవాలి.

దివ్యాంగుల పింఛన్ ఇప్పించండి

- కాసారపు చంద్రం, కొండాపూర్, ముస్తాబాద్



ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మా కుతురు కాసారపు అనన్య పుట్టుకతోనే మతిస్థిమితం లేదు. ఆమెకు మెదడులో నరాలు పనిచేయకపోవడంతో మంచానికే పరిమితమైంది. వైద్యం చేయించేందుకు లక్షల రూపాయలను ఖర్చు చేసి అనుపత్రులల్లో చూపించినా నయం కాలేదు. దివ్యాంగుల పింఛన్ అందిస్తే ఆ డబ్బులు మందుల కొనుగోలుకు ఉపయోగపడుతాయి. కలెక్టర్ స్పందించి దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయించాలి.

మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- నాగుల శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, సిరిసిల్ల



సిరిసిల్ల మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేసిన అన్సారీ, కరోనా లాక్‌డౌన్ సమయంలో మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న వెల్దండి సమ్మయ్యతో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారి అన్సారీ తమ విధులను ఉల్లంఘిచారు. వారిపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. విధులను ఉల్లంఘిస్తూ సాధారణ పట్టణ ప్రజలపై కరోనా నిబంధన ఉల్లంగించారని కేసులు నమోదు చేసిన అధికారులు అదే విషయంలో అప్పటి మున్సిపల్ వైస్ చైర్మన్ కరోనాను ఉల్లంఘిచారని ఫిర్యాదులు చేసినా అతనిపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి అధికారులపై చర్యలు తీసుకోవాలి.

కాస్తులో ఉన్న భూమిని ధరణిలో నమోదు చేయాలి

- రాళ్లపేట ముదిరాజ్ సంఘ నాయకులు

తంగళ్లపల్లి మండలంలోని ఓబులాపూర్ (పీకె) రెవెన్యూ గ్రామ పరిధిలోని ఐదెకరాల భూమిని రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేసి కాస్తులో ఉన్న అ భూమిని ధరణి అన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ రాళ్లపేట గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. రాళ్లపేట గ్రామంలోని ముదిరాజ్ కులానికి చెందిన వంద కుటుంబాలము కలిసి ముదిరాజ్ సంఘాన్ని ఏర్పాటు చేసుకుని సంఘం పేరున ఓబులాపూర్(పీకె) గ్రామ శివారులోని సర్వే నంబర్53/4చ 53/6లో ఉన్న ఐదెకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ భూమిని డ్యాకుమెంట్స్ ప్రకారం 21-08-2000 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసుకుని మామిడితోటతో పాటు వరి సాగు చేస్తున్నామనిఆ భూమిని ధరణి అన్‌లైన్ నుంచి తొలగించారని దానిని తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, దుర్గయ్య, చిరంజీవి, సురేందర్ పాల్గొన్నారు.

శివనగర్‌లో విద్యుత్ లైన్‌లను సరిచేయండి

సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌లో ఇళ్లమధ్యలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు సెస్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తాజా మాజీ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ శివనగర్‌లో చేతికి అందే ఎత్తులో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉన్నాయన్నారు. కాలనీకి చెందిన వేముల రామకృష్ణ, మంచె జగన్, కుందెన బాల రాజు, రాజేంద్ర ప్రసాద్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

రగుడు 'డబుల్' ఇళ్లలో సదుపాయాలు కల్పించాలి

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 1వవార్డు రగుడు శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సదుపాయాలను కల్పించాలని కాలనీ మహిళలు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి వినతిపత్రం అందజేశారు. సీసీ కెమెరాలతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించి రక్షణ కల్పించాలని కోరారు. మిషన్ భగీరథ నీటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సునీత, రేణుక, కవిత, నవ్య, భవిత, సుగుణ, లత, రేఖ, సువర్ణ, అంజన్నమ్మ, పద్మ, అంజలి, అనిత, కవిత తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి వచ్చిన అర్జీదారులు

జాతర మహోత్సవాల్లో ప్రభుత్వ విప్



మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం దేవుని తండా, జై సేవాలాల్ ఊరు తండాలో మహంకాళి దేవాలయంలో శ్రీ భద్రకాళి యంత్ర ప్రతిష్ఠాపన, మల్కపేట గ్రామంలో బొల్లి గుట్ట మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గిరిజన నృత్యాలతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, తాళ్లపల్లి ప్రభాకర్, మానుక సత్యం ఉన్నారు.

ఘనంగా మడలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

చందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో మడలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ చెలకల తిరుపతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, అల్లాడి రమేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి

గంభీరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించినందుకు ఈవో తమను బెదిరిస్తున్నాడని గంభీరావుపేట పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గంభీరావుపేటలో సోమవారం వారు విలేఖరులతో మాట్లాడారు. తమకు రావాల్సిన వేతనాల కోసం ఈవోను అడిగితే పట్టించుకోలేదని, అందుకే కలెక్టర్‌కు చెప్పామని పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. తమకు రెండు మూడు రోజుల్లో వేతనాలు రాకుంటే సమ్మెబాట పడుతామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి

కోనరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. మండలంలోని బావుసాయిపేట గ్రామం బూత్ అధ్యక్షుడు గుంటి పర్శరాములు తండ్రి గుంటి భూమయ్య, ధర్మారంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పొట్ల బాలమల్లు కుమారుడు పొట్ల రాకేష్ మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి మాట్లాడారు.

బావిలో పడి మహిళకు గాయాలు

వేములవాడ టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అయ్యోరుపల్లి గ్రామానికి చెందిన నేదూరి భారత (55) అనే మహిళ వ్యవసాయ పనుల నిమిత్తం తన భర్తతో కలిసి పొలం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. గమనించిన భర్త వెంటనే గ్రామస్థులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది స్థానికుల సాయంతో క్రేన్‌తో మహిళను బయటకు తీశారు. రెండు కాళ్లు విరిగినట్లు వైద్యులు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

చందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన కాసారపు పెద్ద రాములుగౌడ్ రోజు మాదిరిగానే సోమవారం కల్లు గీసేందుకు ఈత చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గీత కార్మికుడిని చికిత్స నిమిత్తం వేములవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం

చందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వన్యప్రాణుల ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఉపాధ్యాయులు కే.శ్రీధర్, బి.రాజు ఎస్.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలను గమనిస్తున్న ప్రజలు

● కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మార్చి 3 (అంధ్రజ్యోతి) : సిరిసిల్ల ప్రాంతంలోని మానేరు వాగు నుంచి ఇసుకను గత ప్రభుత్వం అక్రమంగా అమ్ముకోవడంతోనే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి పోయి ఈ పరిస్థితి వచ్చిందని, బీఆర్ఎస్ అవినీతి అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో నిర్మించిన రంగనాయకసాగర్ నుంచి మాజీ మంత్రి హరీష్‌రావు తన నియోజక వర్గంలోని ప్రతి గ్రామానికి కాలువను నిర్మించుకున్నాడని కేటీఆర్ తన నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామానికి కూడా కాలువ నిర్మించకపోవడంతో చెరువుల్లోకి నీరు రాకపోవడానికి కేటీఆర్ కారకుడని అన్నారు. మీ హయాంలో నిర్మించిన మల్కపేట రిజర్వాయర్‌లో నీటిని నింపి విడుదల చేయలేదని విషయాన్ని కేటీఆర్ గ్రహించాలని అన్నారు. రైతుల వద్దకు వచ్చి పంటలు ఎండిపోతున్నాయని రైతులతో ధర్నా చేస్తామని ప్రకటన చేయడం హాస్యాస్పదం అన్నారు. కేసీఆర్ అంటేనే కాళేశ్వరం అని అనడం కాదు, కేసీఆర్ అంటే కరప్షన్‌రావు అని అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని వీధివ్యాపారుల కోసం నిర్మించిన దుకాణాలను బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నాయకులు అమ్ముకున్నారని అన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన కేటీఆర్‌ను ప్రజల నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మహిళ సెల్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, గడ్డం నర్సయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, చెన్నమనేని కమలాకర్‌రావు, కుడిక్యాల రవికుమార్, నేరేళ్ల శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ భైరినేనిరాము పాల్గొన్నారు.

రైతులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

ఎల్లారెడ్డిపేట: సాగునీటిని మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మకు తరలించుకు పోయినా మౌనంగా ఉన్న కేటీఆర్ ఈ ప్రాంత రైతులకు క్షమాపణ చెప్పాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్న సమయంలో కాల్వ పనులు పూర్తి చేయలేదన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట, మార్చి 3 (అంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు సత్తవ్వ గుండెపోటుతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల బిల్లులు 8 నెలలుగా రావడం లేదని అన్నారు. ఆ బెంగతోనే సత్తవ్వ మృతి చెందిందని అన్నారు. వెంటనే వీరి సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట కవిత, పులి వసంత, సత్యవ్వ, రాధా, నర్సవ్వ తదితరులు ఉన్నారు.

కేరళలో ముస్తాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థి మృతి

ముస్తాబాద్, మార్చి 3 (అంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలానికి చెందిన బీటెక్ విద్యార్థి కేరళలో మృతి చెందినట్లు సమాచారం అందింది. మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి హైదరాబాద్‌లోని తన స్నేహితులతో కలిసి కేరళ టూర్‌కు వెళ్లాడు. బోట్‌లో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాలు జారి నీటిలో పడి మృతిచెందినట్లు తెలిసింది. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

నేతల పరామర్శలు

తంగళ్లపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్‌ను సోమవారం కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. బద్దెనపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ తల్లి గుగ్గిళ్ల భాగ్యలక్ష్మీ ఇటీవల అనార్యోగంతో మృతి చెందింది.

● ఇల్లంతకుంట : మండలంలోని అనంతగిరి గ్రామ ముత్యాల పోచమ్మ దేవస్థాన మాజీ చైర్మన్ వల్లంపట్ల రాజారామ్‌ను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సోమవారం పరామర్శించారు. రాజారామ్ తల్లి రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందింది.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మహాదేవుని ధర్మయ్య కుటుంబీకులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి సోమవారం సందర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పంటలకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం యాసంగి సాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ పనితీరు, సంక్షేమ హాస్టళ్ల, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆయా శాఖ అధికారులతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలోని 43 రెసిడెన్షియల్ హాస్టళ్లలోని విద్యార్థుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అలాగే ఇతర శాఖల జిల్లా అధికారులతో కమిటీ వేసి నిత్యం తనిఖీ చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని రెసిడెన్షియల్ అలాగే ఇతర విద్యాలయాలను నిత్యం ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నానని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. విద్యుత్ కోతలు లేవని, నీటి సరఫరాలో ఇబ్బందులు లేవని వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాచర్లగొల్లపల్లిలోని లబ్ధిదారుడు పిట్ల భిక్షపతికి మంజూరైన రూ.60 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక నాయకులు సోమవారం ఆయనకు అందజేశారు. పాక్స్ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గణపతి, శ్రీశైలం పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన సోమవారం రోజున భక్తులు వేములవాడకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారుగా నాలుగు గంటలు క్యూలైన్‌లో నిరీక్షించి ఆలయంలోకి ప్రవేశించారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. శ్రీభీమేశ్వర, శ్రీనగరేశ్వర, శ్రీబద్ది పోచమ్మ అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్‌లు పర్యవేక్షించారు.

కాలువల ద్వారా పంటలకు నీరందించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు



కాలువలో నీరు రావడం లేదని నిరసన తెలుపుతున్న రైతులు

చందుర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా వదిలేసిన కాలువ నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య అన్నారు. కాలువ నిర్మాణం పూర్తి చేయాలని సోమవారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు పనులలో 100 మీటర్ల పొడవు కాలువ పనులు చేయలేదన్నారు. దీంతో రైతులకు కాలువ నీరు అందడం లేదన్నారు. మర్రి రాజమల్లు అనే రైతుకు వ్యవసాయ బావికి నష్టపరిహారం తక్కువ మంజూరు చేయడంతో ఆ రైతు నష్టపహారం తీసుకోలేదు. దీంతో కాలువ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. రైతుకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇచ్చి 100 మీటర్ల కాలువ నిర్మాణం పూర్తి చేస్తే 60 మంది రైతులకు సాగు నీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మర్రి రాజు, లక్కర్సు మహేష్, బట్టు తిరుపతి, మార్త గంగాధర్, బత్తుల కమలాకర్, లక్కర్సురాజేశం, మర్రి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : ఎగువ మానేరు కాలువల వచ్చే నీటి ద్వారా చివరి ఆయకట్టు వరకు అందించాలని బీసీ సంఘం జాతీయ కార్యదర్శి శీలం స్వామి పేర్కొన్నారు. సాగునీరు అందరక ముస్తాబాద్‌లో ఆయకట్టు కింద ఉన్న పొలాలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులతో కలిసి నిరసన తెలిపారు. సక్రమంగా నీళ్ల అందించి రైతులను రక్షించాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు నీరులేని కాలువల్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మెంగని మనోహర్ మిరు దొడ్డి బాలరాజు, బాలెల్లు, బాలయ్య, సాకలి చంద్రం, చంద్రయ్య, ఎల్లం, ఎడ్ల రాజయ్య శ్రీశైలం పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

ఇల్లంతకుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో మండల కేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కరీంనగర్‌లోని రంగినేని గార్డెన్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఓపెన్ కరాటే పోటీలలో చెలిమిల్ల రక్షిత, ఏనుగుల సుశాంత్ పటేల్, చొప్పరి విఘ్నేష్, సుదగోని పెద్దోళ్ల గణేష్‌లు బంగారు పతకాలను, సావనపెల్లి ప్రహల్య రజత పతకాన్ని, చొప్పరి హర్షిత, నల్లగొండ అక్షరలు కాంస్య పతకాలను సాధించారు. పాఠశాలలో సోమవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి, కరాటే మాస్టర్ శరత్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీవీపీ కార్యవర్గం ఏర్పాటు

కోనరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండల ఏబీవీపీ కార్యవర్గ ఎన్నిక సోమవారం జరిగింది. కన్వీనర్‌గా ఇట్టిరెడ్డి గణేష్, కార్యదర్శిగా నందగిరి గణేష్, జాయింట్ కార్యదర్శిగా చేతన్, చల్ల అభిషేక్, సోషల్ మీడియా కన్వీనర్ గా అనుముల అభిషేక్, శ్రీహరి, మహేష్ లు ఎన్నికయ్యారు. నాయకులు పూజం కార్తీక్, రాజారావు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఇల్లంతకుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని బీసీ బాలుర వసతిగృహ విద్యార్థులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. 41మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయగా ముగ్గురికి మోడరేట్ ఎనీమియా, ఐదుగురికి మైల్డ్ ఎనీమియా ఉండగా ఐరన్ మాత్రలు ఇచ్చారు. భోజనం చేసే సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జీవనజ్యోతి, కట్ట రమేష్, ఏఎన్ఎమ్ కవితలతో పాటు ఆశాకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

కోనరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన పరికరాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి మురళి నాయక్ సందర్శించి అభినందించారు. హెచ్ఎం అజ్మీర మదన్‌లాల్, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, రాము, వెంకటేశం, సంజీవ్, శృతి, అనూష ఉన్నారు.